క్లుప్తంగా

నారాయణ మాటలు బూటకం


మాట్లాడుతున్న రవిచంద్రారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ హయాంలో నగరాన్ని అభివృద్ధి చేశామంటూ పుస్తకాన్ని నారాయణ పంపిణీ చేశారని, ఇది బూటకమని, దీనిపై చర్చకు సిద్ధమానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి ప్రశ్నించారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. నారాయణ వద్ద కీర్తి కోసం డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాలేరుగా చేరారని విమర్శించారు. వేరే కళాశాలల విద్యార్థుల ఫొటోలను ఉపయోగించి.. తమ కళాశాలకు ర్యాంకులు వచ్చాయంటూ డప్పు కొట్టుకున్నారని ఆరోపించారు. రూ.5264 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్తున్నారని, వీటికి లెక్కలు చెప్పాలని ప్రశ్నించారు. సిద్ధాంతాల కోసం పార్టీ మారానని చెప్పుకొనే రూప్‌కుమార్ తన పదవికి రాజీనామా చేయగలరానని ప్రశ్నించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని అన్ని సర్వేలు చెప్తున్నాయని, భవిష్యత్తులో టీడీపీ కనుమరుగవ్వడం ఖాయమని చెప్పారు. పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డిని విమర్శించే స్థాయి ఆయనకు లేదని చెప్పారు. విజయసాయిరెడ్డితో నెల్లూరు అభివృద్ధి తథ్యమని తెలిపారు.

ఘన నివాళి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్ సోదరుడు సుభానీ కుమారుడు రఫీ సోమవారం మరణించారు. ఈ క్రమంలో చాణుక్యపురిలోని వారి నివాసానికి మేయర్ స్రవంతి మంగళవారం వెళ్లి రఫీ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, తిరిగి సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకిసేవ గావించారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

మనుబోలు : రెండు మోటార్ బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మనుబోలు మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. నెల్లూరు నుంచి ఇద్దరు యువకులు బైక్‌పై గూడూరు వైపు వస్తున్నారు. కాగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి మరో మోటార్ బైక్ మనుబోలు ఊరిలోకి వెళ్లేందుకు హైవేపైకి రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మనుబోలుకు చెందిన శీనయ్యకు, నెల్లూరుకు చెందిన మరో యువకుడికి గాయాలయ్యాయి.

ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం

మనుబోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పేదలకు కూడా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెచ్చిందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత అన్నారు. మండలంలోని కాగితాలపూరు సచివాలయ పరిధిలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ డాక్టర్ లాస్య, కంటి విభాగం వైద్యులు కవిత, బావన రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్‌లు వెంకటరమణయ్య, హైమావతి, ఫార్మాసిస్ట్ పద్మజ, హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి విమల, వీఆర్వో వెంకయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

• వీఎస్‌యూ వీసీ సుందరవల్లి

వెంకటాచలం : 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో అమరవీరుల దినోత్సవంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన సదస్సు, పరిశుభ్రత కార్యక్రమాలను మంగళవారం చేపట్టారు. తొలుత వీసీ సుందరవల్లి విద్యార్థులు, అధ్యాపకులతో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటు ద్వారా తమ పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం రాజ్యాంగం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మన కోసం కాకుండా అందరి కోసం తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, పట్టణాలు, నగరాల్లోనూ ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వీఎస్‌యూ ఆవరణలో చెత్తను తొలగించారు. ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్ బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలో మాజీ కౌన్సిలర్ చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 19వ డివిజన్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ బండ్లమూడి అనిత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను పార్టీలోకి పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆహ్వానించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, పచ్చా రవి, కొండేటి శివారెడ్డి, జల్లి కుమార్, కొండేటి రఘురామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



• చంద్రబాబు కుట్రపూరిత చర్యలకు నిరసన

నెల్లూరు(బారకాసు): ప్రజలకు సేవ చేస్తున్న తమపై రాజకీయ పార్టీలు నిందలు మోపుతున్నాయని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు తీరును నిరసిస్తూ 21వ డివిజన్‌కు చెందిన 35 మంది వలంటీర్లు కార్పొరేటర్ మొయిళ్ల గౌరి సమక్షంలో మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అనంతరం రాజీనామా లేఖలను వార్డు సచివాలయాల అడ్మిన్లకు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడారు. చంద్రబాబు, పవన్, బీజేపీ తీరుతో మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. పింఛన్లను ఇవ్వనీయకుండా తమను అడ్డుకోవడం కలిచివేసిందని తెలిపారు. తమకు అవకాశమిచ్చిన జగనన్న రుణాన్ని తీర్చుకుంటామని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మరోసారి ఏర్పడనున్న ప్రభుత్వంలో మరిన్ని సంక్షేమ పథకాలను పేదలకు అందించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

రూరల్‌ను ప్రథమ స్థానంలో నిలుపుతారు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడంతో పాటు మంచి ఎమ్మెల్యేగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలుస్తారని ఆయన కుమార్తె హిమబిందు పేర్కొన్నారు. 37వ డివిజన్లోని క్రాంతినగర్, రామ్‌నగర్, మిలటరీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించిన ఆమె మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల.. ఎంపీగా విజయసాయిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నగర మహిళాధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, ఎమ్మెస్సెమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, నేతలు బాబు, వేలూరు శ్రీధర్‌రెడ్డి, దారా వంశీ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో హిమబిందు

రోడ్లపై గోవులు సంచరిస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): నగర రోడ్లపై సంచరిస్తూ.., వాహనదారులకు ఇబ్బందిగా మారిన ఆవులను గోశాలకు తరలిస్తామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, చాకలివీధి, మెక్లిన్స్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆవులను కల్లూరుపల్లిలోని గోశాలకు మంగళవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని.. స్పెషల్ డ్రైవ్‌లను రోజూ నిర్వహించి వాటిని గోశాలకు తరలిస్తామని స్పష్టం చేశారు. గోశాలకు తరలించాక వాటి సంరక్షణ బాధ్యతలను నగరపాలక సంస్థ పర్యవేక్షిస్తుందని తెలిపారు. పశువులను కట్టడి చేయాలని యజమానులకు గతంలోనే నోటీసులను జారీ చేసినా పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కాలువల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.


గోశాలకు ఆవుల తరలింపు

రైతుబజార్‌లో వైద్య శిబిరం



నెల్లూరు(అర్బన్): ఫతేఖాన్‌పేటలోని రైతుబజార్‌లో ప్రాచీన సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్యశిబిరాన్ని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రోగులను వైద్యుడు గురూజీ జైశ్రీరామ్ పరీక్షించి మందులను అందజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా నరాల బలహీనత, కీళ్ల నొప్పులు తదితరాలు నయమవుతాయని ఆయన చెప్పారు. వెన్నెముక నొప్పి, మోకాళ్లు, మెడ, భుజాలు, కీళ్ల నొప్పులు తదితరాలకు సిద్ధ వైద్యం చేశారు. రామ్మోహన్‌రెడ్డి, షణ్ముఖ, మహేంద్రసింగ్, జగదీష్, రాఘవేంద్ర, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వీనులవిందుగా నాదస్వర కచేరి


విశేషాలంకారం


విజయగోపాల్, కార్తికేయన్ కచేరి

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా స్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అలంకారంలో మంగళవారం దర్శనమిచ్చారు. చెన్నైకి చెందిన డాక్టర్ విజయగోపాల్, కార్తికేయన్ బృంద ఆధ్వర్యంలో వేణు, నాదస్వర కచేరి వీనులవిందుగా సాగింది. అనంతకృష్ణన్, తిరుచ్చి కృష్ణస్వామి వాద్య సహకారం అందించారు. భవానీబాయి, శారద భాగవతారిణులతో హరికథా గానాన్ని నిర్వహించారు. స్థానిక ఔత్సాహిక కళాకారులతో గాత్ర, వీణ కచేరిని జరిపారు. భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకోవాలి


శ్రీనివాసులును సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

నెల్లూరు(లీగల్): జిల్లా ఐదో అదనపు కోర్టులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన పత్తిపాటి శ్రీనివాసులును కోర్టు ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పత్తిపాటి శ్రీనివాసులుకు అభినందన సభను జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. జిల్లా కోర్టు పరిపాలనాధికారి ప్రసాద్, నాగేశ్వరరావు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, గౌరవాధ్యక్షుడు నరసింహారావు, నేతలు శివకుమార్, దీపక్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో తైక్వాండో కలర్ బెల్ట్ పోటీలను మంగళవారం నిర్వహించారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సలామ్, జిల్లా కార్యదర్శి అఖిల్, శ్రీనివాసరావు, చరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని యనమలవారిదిన్నె, మెడికవర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు అన్నదానంతో పాటు 300 మందికి మజ్జిగ ప్యాకెట్లను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. సాయిపథం ఆస్పత్రి నిర్వాహకురాలు, వైద్యురాలు రాధామాధవి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. రమేష్‌బాబు, కార్తికేయ, శశి, కిరణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. వెంటనే స్పందిస్తా


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

• వైఎస్సార్సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తనకెలాంటి వ్యాపారాల్లేవని.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. వారికి ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 11వ డివిజన్లో ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వెళ్లి పింఛన్లు అందించేవారన్నారు. టీడీపీ కుట్రలు చేయడంతో అవ్వాతాతలు, దివ్యాంగులు ఇంటి వద్దే పింఛన్లను అందుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. సంక్షేమ పథకాలు గడప వద్దకే చేరాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ప్రత్యేక మేనిఫెస్టోను తయారు చేసి నెల్లూరును గ్రీన్ సిటీగా చేస్తామని ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి చెప్పడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ అభ్యర్థి నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో భూగర్భ డ్రైనేజీ పేరుతో నగరంలోని రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేసి వెళ్లిపోయారన్నారు. నగర నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసునన్నారు. కార్పొరేటర్ గోతం అరుణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మరోసారి సీఎం కావాలని కాంక్షిస్తూ..


రంగారెడ్డిని సత్కరిస్తున్న సభ్యులు

• పడారుపల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు సిటీ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి.. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలను చేపట్టాలని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలను నెల్లూరు రూరల్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 23వ డివిజన్ పడారుపల్లిలోని ఏఐఎం అసెంబ్లీస్ చర్చిలో పాస్టర్లతో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న సీఎంకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, క్లస్టర్ - 2 అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి, నేతలు బెల్లంకొండ వెంకయ్య, వేమిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, పాస్టర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.